క్లుప్తంగా

28న గంగమ్మ జాతర

బేతంచెర్ల: మండల పరిధిలోని సీతారామాపురం గ్రామంలో సమరసతా సేవా ఫౌండేషన్, టీటీడీ సహకారంతో నిర్మించిన గంగమ్మ ఆలయంలో ఈనెల 28న గంగమ్మ జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పొలాల రహదారి పనులను పరిశీలించిన ఎంపీపీ



పనులను పరిశీలిస్తున్న బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలో పొలాలకు వెళ్లే రహదారి సక్రమంగా లేక రైతులు ఇబ్బందులు పడుతుండేవారు. రైతుల విజ్ఞప్తి మేరకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో రూ.10 లక్షల డీఎంఎఫ్ నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు శరవేగంగా జరుగుతున్న పొలాల రహదారి పనులను ఆదివారం గ్రామస్తులతో కలిసి ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి పరిశీలించారు. రహదారి పనులు పూర్తయితే పొలాలకు వెళ్లే రైతులకు సౌకర్యంగా మారనుంది.

పది పరీక్షలకు అధికారుల నియామకం

కోవెలకుంట్ల: పట్టణంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో ఏప్రిల్ 3వ తేదీ నుంచి నిర్వహించనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికారులను నియమించినట్లు ఎంఈఓ తిమ్మారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ, జిల్లా పరిషత్ బాలికోన్నత, సెయింట్ జోసఫ్స్ పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. చీఫ్ సూపర్‌వైజర్లుగా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రామకృష్ణ, అరుణకుమారి, లలిత శ్యామలను నియమించామన్నారు. డిపార్ట్‌మెంటల్ అధికారులుగా సంజామల మండలం పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, బనగానపల్లె మండలం ఇల్లూరు కొత్తపేట, బనగానపల్లె జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు కుమార్‌బాబు, యాగంటప్పను నియమించినట్లు ఎంఈఓ వివరించారు.

ఆర్థిక సాయం

డోన్ టౌన్: పట్టణంలోని తారకరామనగర్‌కు చెందిన వృద్ధురాలు నారాయణమ్మకు ఆదివారం చేయూత సంస్థ తరుపున సభ్యులు రూ. 7వేలు అందజేశారు. ఇటీవల నారాయణమ్మ భర్త మరణించడంతో ఒంటరిగా ఉన్న ఆమె ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న చేయూత సంస్థ సభ్యులు తమవంతుగా ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో చేయూత సంస్థ వ్యవస్థాపకుడు రామనాయుడు, కార్యదర్శి రవికుమార్, కోశాధికారి మీసేవా శ్రీనులు, సభ్యులు అశోక్, గుర్రం మధు తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి బండలాగుడు పోటీలు

ప్యాపిలి: మండలంలోని కలచట్ల పంచాయతీ పరిధిలోని ఎస్ రంగాపురంలో ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు వివిధ విభాగాల్లో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామనవమి సందర్భంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 29వ తేదీన ఆరు పళ్ల లోపు వృషభాలకు పోటీలు నిర్వహించి రూ. 40 వేలు నగదు బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. రెండవ, మూడవ, నాలుగు, ఐదో స్థానాల్లో నిలిచిన వృషభాలకు వరుసగా రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ. 10 వేలు, రూ. 5 వేలు చొప్పున బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే 30 వ తేదీ న్యూ కేటగిరి విభాగంలో పోటీలు నిర్వహించి విజేతగా నిలిచిన వృషభాలకు రూ. 50 వేలు నగదు బహుమతి అందజేయనున్నారు. రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఏడో స్థానాల్లో నిలిచిన వృషభాలకు వరుసగా రూ. 45 వేలు, రూ. 30 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు, రూ. 5 వేలు చొప్పున బహుమతులు అందజేస్తామన్నారు. 31వ తేదీ దేశవు ఎద్దులకు పోటీలు నిర్వహించి మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచిన వృషభాలకు వరుసగా రూ. 20 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు, రూ. 5 వేలు, రూ. 3 వేలు చొప్పున బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఒక్కో విభాగానికి రూ. 600 చొప్పున చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

బీజేపీ ప్రభుత్వానికి రాహుల్ అంటే భయం

డోన్ టౌన్: బీజేపీ ప్రభుత్వానికి ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యులు రాహుల్ గాంధీ అంటే భయం పట్టుకుందని కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీనరసింహాయాదవ్, డాక్టర్ గార్లపాటి మద్దిలేటీలు అన్నారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటును నిరశిస్తూ ఆదివారం పట్టణంలోని పాతబస్టాండ్‌లో ఉన్న సమైఖ్యాంధ్ర కట్ట మీద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఒక్క రోజు సంకల్ప సత్యగ్రహ దీక్ష చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలు పాటించకుండా కేవలం ప్రతిపక్ష నేతలపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాలుపడుతుందని ఆరోపించారు. లలిత్ మోడీ, నీరవ్‌మోడీలు వేల కోట్లు అప్పులు చేసి దేశాన్ని విడిచి విదేశాలకు పారిపోయారని, అలాంటి వారిని శిక్షించకుండ కళ్లు మూసుకున్న బీజేపీ ప్రభుత్వాన్ని రాహుల్‌గాంధీ ప్రశ్నిస్తే తప్పా అని వారు నిలదీశారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి ఉన్నిగోర్ల జనార్దన్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు పఠాన్‌అబీబ్‌ఖాన్, బీసీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నాగరాజు పాల్గొన్నారు.

అతివేగం...తీరని శోకం!

- రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్న యువత
- తల్లిదండ్రులకు తప్పని కడుపుకోత
- ఏటేటా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- బేతంచెర్ల మండలంలో మూడేళ్లలో 47 మంది మృత్యువాత
- అధికారులు చైతన్య సదస్సులు చేపడుతున్న కనిపించని మార్పు



కర్నూలు రోడ్డులో ఆటో-కారు ఢీకొన్న సంఘటన (ఫైల్)

బేతంచెర్ల: రోడ్డు ప్రమాదాలు ఏటేటా పెరుగుతూనే ఉన్నాయి. రోడ్డు నిబంధనలు పాటించని మూలంగా ఎంతోమంది మృత్యువాత పడుతూ తల్లిదండ్రులు, రక్తసంబంధీకులకు శోకం మిగుల్చుతున్నారు. అతివేగం,హెల్మెట్ ధరించకపోవడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం తదితర నిర్లక్ష్యాల మూలంగా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువ శాతం స్వయంకృపరాదమే అంటున్నారు చాలా మంది. రోడ్డు ప్రమాదాలపై సంబంధిత అధికారులు చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నా ఏ మాత్రం మార్పు కనిపించడం లేదు. డ్రైవింగ్ నిబంధనలు అమలు చేయడంలోనూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. కేవలం బేతంచెర్ల మండలంలోనే 2020 నుంచి ఇప్పటి వరకు రోడ్డు ప్రమాదంలో 47 మంది మృత్యువాత పడ్డారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఎందరో గాయపడుతున్నారు.

మృత్యువాత పడుతున్న యువత

ప్రత్యేకించి రోడ్డు ప్రమాదాల్లో యువత మృత్యువాత పడుతున్నారు. డ్రైవింగ్ నిబంధనలు పాటించనందునే మృతి చెందుతున్నారని అధికారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హెల్మెట కూడా ధరించకపోవడంతో పెద్దతప్పిదం అంటున్నారు. స్నేహితులతో కలిసి ఇష్టారాజ్యంగా డ్రైవింగ్ చేస్తూ మృతి చెందుతున్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, హెల్మెట్ ధరించకపోవడం, ఇద్దరికి మించి వెళ్లడం మూలంగా ప్రమాదాలకు గురవుతూ తల్లిదండ్రులను శోకం మిగిల్చుతున్నారు. ఒకే రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి.

సంవత్సరం	గాయాల	మృతిచెందిన వారు
2020	9	8
2021	5	16
2022	17	19
2023 జనవరి నుంచి ఇప్పటి వరకు	1	4

● 2021 నవంబర్ 13న యువకుడు మృతి



మృతి చెందిన సాయిప్రకాష్ (ఫైల్)

బేతంచెర్ల మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామానికి చెందిన వేముల తిరుమలేష్, రాజేశ్వరి దంపతులకు కుమారుడు, కుమార్తె. కొడుకు వేముల సాయి ప్రకాశ్ (18)తిరుపతిలో డిగ్రీ బీజెడ్‌సీ గ్రూపు ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. 2021 నవంబర్ 12వ తేదీన గ్రామానికి వచ్చాడు. 13వ తేదీన పని నిమిత్తం కర్నూలుకు వెళ్లి ద్విచక్రవాహనంపై గ్రామానికి వస్తుండగా ఆంజనేయ స్వామి ఆలయం సమీపాన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు రోధనలు మిన్నంటాయి.

● 2021 నవంబర్ 26న...



సాయి తరుణ్(ఫైల్)

డోన్ పట్టణం పాతపేటకు చెందిన నారప్పగారి గోపాల్, రమణమ్మ కుమారుడు సాయి తరుణ్ గౌండ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 2021 నవంబర్ 26వ తేదీన బేతంచెర్ల పట్టణంలో జరిగిన ఓ వివాహానికి హాజరై ద్విచక్రవాహనంపై సాయంత్రం 4 గంటల సమయంలో తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. ఆర్‌కొత్తపల్లె గ్రామ సమీపాన ప్రమాదవశాత్తు గుర్తు తెలియని వాహనం ఎదురుగా ఢీకొట్టింది. ఈప్రమాదంలో తలకు తీవ్రగాయాలైన సాయితరుణ్(21) అక్కడి కక్కడే మృతి చెందాడు.

● 2021 నవంబర్ 29న



ఖాశీం బాషా (ఫైల్)

డోన్ మండలం, కమలాపురం గ్రామానికి చెందిన దూదేకుల పెద్ద దస్తగిరి, హుసేన్‌బీ దంపతుల ఏకైక కుమారుడు ఖాశీం బాషా. 2021 నవంబర్ 29న ద్విచక్రవాహనంపై వ్యక్తిగత పనినిమిత్తం బేతంచెర్లకు వచ్చిన ఖాశీం ఆర్ఎస్ రంగాపురం గ్రామ సమీపాన రోడ్డు పక్కన ఆగివున్న లగేజీ వాహనాన్ని ఢీకనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చాడు.

● 2022 మే 4న ముగ్గురు యువకుల మృతి



మృత్యువాత పడిన బోయ మధు కృష్ణ(ఫైల్), ఎద్దుల మనోహర్(ఫైల్), తెలుగు జయచంద్ర (ఫైల్)

2022 మేనెల 4వ తేదీన డోన్‌కు వెళ్లే రహదారిలోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో బేతంచెర్ల పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు మృతి చెందారు. ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్న సంఘటనలో వడ్డెపేట కాలనీకి చెందిన మధు కృష్ణ(20), స్థానిక డోన్ క్రాస్ రోడ్డులో నివాసం ఉండే ఎద్దుల మనోహర్(18)తోపాటు సంజీవనగర్ కాలనీకి చెందిన తెలుగు జయచంద్ర మృతి చెందారు. వారితో పాటు ఉన్న గుడిసె మహేంద్ర, మరో ద్విచక్రవాహనంపైన ఉన్న బోయ అజయ్ కుమార్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. ఎద్దుల రవీంద్ర, పద్మావతమ్మ దంపతులకు మనోహర్ ఏకైక సంతానం. ఒకేసారి ముగ్గురు మృత్యువాత పడడంతో ఆయా కుటుంబాల్లో విషాధం నెలకొంది. తల్లిందండ్రులు, బంధువల రోధనలు మిన్నంటాయి.

● 2022 సెప్టెంబర్ 1వ తేదీన మరోముగ్గురు



మంగలి మహేంద్ర, చిన్నారి సుదర్శన్, ప్రభాకర్ (ఫైల్)

2022 మేనెల 4వ తేదీన డోన్‌కు వెళ్లే రహదారిలోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో బేతంచెర్ల పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు మృతి చెందిన సంఘన మరవకముందే 2022 సెప్టెంబర్ 1వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మరోముగ్గురు మృతి చెందారు. ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహణాన్ని ఢీ కొనడంతో డోన్ పట్టణానికి చెందిన మంగలి మహేంద్రతోపాటు ఆయన కుమారుడు సుదర్శన్, మిత్రుడు ప్రభాకర్ మృత్యువాత పడ్డారు.

హెల్మెంట్ ధరిస్తే ప్రాణాపాయం ఉండదు



వాహనచోదకులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలి. హెల్మెట్ ధరిస్తే అనుకోకుండా ప్రమాదం జరిగినా ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంది. 2021లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకేసారి ముగ్గురు మృతి చెందడం బాధాకరం. ప్రత్యేకించి యువత తమ కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకోవాలి. తల్లిదండ్రుల మీపైన ఎన్నో ఆశలు పెట్టుకొని ఉంటారు. వారి ఆశలను వమ్ముచేయకుండా యువత పరిమిత వేగంతో ద్విచక్రవాహనాలు నడపటమే కాకుండా తప్పనిసరిగా హెల్మంట్ పెట్టుకోవాలి. – సీఐ ప్రియతం రెడ్డి

ఇకనైనా యువత అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలి



యువకులు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందడం విచారకరం. ఎంతోమంది యువకులు మృతి చెందుతూ తల్లిదండ్రులకు శోకం మిగుల్చుతున్నారు. కుటుంబానికి అండగా ఉండాల్సిన కుమారులు మృతి చెందితే ఆ బాధ మాటల్లో చెప్పలేనిది. వాహనంలో బయటకు వెళ్లేప్పుడు తల్లిదండ్రులను గుర్తించుకోవాలి. తమ కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలి. రోడ్డు నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలి. ప్రత్యేకించి హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయకూడదనే నిబంధనల తమకుతాము విధించుకోవాల్సిన అవసరం ఉంది.
– వైటీ వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకులు

రామాలయం ముస్తాబు



విద్యుద్దీపాలతో మెరిసిపోతున్న ఆలయం

కొలిమిగుండ్ల: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సీతారాముల కల్యాణానికి అంకిరెడ్డిపల్లెలోని రామాలయం అందంగా ముస్తాబైంది. వైఎస్సార్‌సీపీ నాయకుడు కేపీ రామ్మోహన్‌రెడ్డి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గురువారం నిర్వహించబోయే సీతారాముల కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ఆవరణలో కొత్తగా గ్రానైట్‌తో నిర్మించిన కల్యాణ వేదిక భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. రంగు రంగుల విద్యుద్దీపాలతో ఆలయం మెరిసిపోతుంది. జీవిచెట్ల వద్ద ప్రధాన రహదారి వద్ద ఎల్ఈడీ లైట్లతో ఏర్పాటు చేసిన సీతారాముల చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తున్నాయి. కల్యాణ తంతు గ్రామస్తులు వినేందుకు ఆలయం నుంచి ప్రధాన వీధితో జీవిచెట్లు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ వరకు 15 మైక్‌లు ఏర్పాటు చేశారు. కల్యాణం అనంతరం నిర్వహించే గ్రామోత్సవానికి తిరుపతికి చెందిన నాదస్వర సంగీత కళాకారులతో పాటు మహిళా డప్పు కళాకారులు ప్రదర్శన ఇవ్వనున్నారు.

సంక్షిప్తం

సంప్రదాయాల చిహ్నాలు పండుగలు

బేతంచెర్ల: మన సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నాలు మన పండుగలని త్రైత సిద్ధాతం ప్రబోధ సేవా సమితి ధర్మవరం కమిటీ అధ్యక్షులు రామాంజనేయులు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో శోభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకొని త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ధర్మవరం కమిటీ ఆధ్వర్యంలో పండుగలు, సంప్రదాయ గ్రంధాలపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి సభ్యులు మద్దిలేటి, వెంకటేశ్వర్లు, కొండా రెడ్డి, మహాలక్ష్మి, శివలక్ష్మి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

బేతంచెర్ల: పట్టణంలో చేపట్టిన రహదారి విస్తరణ పనులతో సంజీవనగర్ కాలనీకి సరఫరా అయ్యే తాగునీటి పైపులైన్లు దెబ్బతిన్నాయి. యుద్ధ ప్రాతిపాదికన కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి ఆధ్వర్యంలో దెబ్బతిన్న పైపులైన్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం పూర్తి కావడంతో కాలనీకి నీరు అందించారు. దీంతో కాలనీవాసులు నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పది విద్యార్థులకు ఉచిత ప్రయాణం

డోన్ టౌన్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ పల్లె వెలుగు బస్సుల్లో ఉచితంగా వారి స్వస్థలం నుంచి పరీక్ష కేంద్రం వరకు ప్రయాణించవచ్చు అని డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరిగే పబ్లిక్ పరీక్షలకు బస్ పాస్ లేకున్నా పరీక్షలకు సంబంధించిన హాల్ టిక్కెట్ కండక్టరుకు చూపించిప్రయాణించవచ్చు అన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

బేతంచెర్ల: తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యం చేరుకోవాలని ఎంఈఓ సోమశేఖర్ అన్నారు. మండల పరిధిలోని గోర్లగుట్ట ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం హెచ్‌ఎం శివ కుమారస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులతో పాటు, ఇంటి దగ్గర తల్లిదండ్రుల పాత్ర కీలకం అన్నారు. ఇంటి వద్ద విద్యార్థులపై శ్రద్ధ తీసుకుంటే ఉత్తమ విద్యార్థులుగా తయారవుతారన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు రామసుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు చలపతిరెడ్డి, వెంకి రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

బేతంచెర్ల: మండల పరిధిలోని నాగమళ్లకుంట గ్రామంలో పొలం తగాదాల్లో రెండు వర్గాలు ఘర్షణ పడ్డాయి. నాగమల్లకుంట గ్రామ సమీపాన వ్యవసాయ భూమికి సంబంధించి ఒక వర్గం వారికి డోన్ సివిల్ కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చింది. ఈ మేరకు పొలంలో బోర్డు నాటేందుకు వెళ్లగా మరో వర్గంవారు మా పొలంలో మీరు ఏవిధంగా బోర్డు నాటుతారని గొడవ పడ్డారు. ఇరువర్గాల వారు రాళ్లతో దాడి చేసుకున్నారు. ఈవిషయంపై ఇరు వర్గాలు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఇరువురిని బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ శివ శంకర్ నాయక్ తెలిపారు.

ఘనంగా సీతారామాంజనేయ విగ్రహాల ప్రతిష్ఠ

- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



శ్రీసీతారాంజనేయ స్వాముల వారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి..

అవుకు: మండల పరిధిలోని గడ్డమేకలపల్లె గ్రామంలో శ్రీ సీతారామాంజనేయ విగ్రహా ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి వేదపండితులు పూర్ణకుంభంతో ఆహ్వానించారు. ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని ప్రసాద్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి, నాయకులు బండి బ్రహ్మానంద రెడ్డి, ఉమ్మడి పెద్ద మునిరెడ్డి తదితరులు స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు తోటపల్లి కిశోర్ శర్మ బృందం ఉదయం ప్రాతఃకాల పూజలతోపాటు అధివాసంగ హోమం, యంత్ర ప్రతిష్ఠ అనంతరం సీతారామలక్ష్మణ, ఆంజనేయ, ధ్వజస్తంభాలను ప్రతిష్ఠించారు. అనంతరం ప్రాణప్రతిష్ఠ తదితర పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు స్వామివార్ల దర్శన భాగ్యాన్ని కల్పించారు.

గడ్డమేకలపల్లె గ్రామాభివృద్ధి చేస్తాం

గడ్డమేకలపల్లె గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హామీ ఇచ్చారు. త్వరలో గ్రామంలో శివాలయ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, శుద్ధజల కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. గుండ్లశింగవరం నుంచి గడ్డమేకలపల్లె, రామవరం మీదుగా మెట్టుపల్లె వరకు బీటీ రోడ్డు వేయించామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కోనేటి సుంకన్న, కోనేటి తురువతయ్య, ఈడిగ బాటరాజు, కోనేటి వెంకటేశ్వర్లు, దేవరకొండ గంగన్న, దేవరకొండ పుల్లన్న, కుళ్లాయప్ప, కోనేటి సుధాకర్, రామవరం సర్పంచ్ మూరబోయిన మనోహర్, ఉపసర్పంచ్ మనోహర్, మెట్టుపల్లె ఉపసర్పంచ్ మేకల వెంకటేశ్వర రెడ్డి, రామవరం చిన్నతిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామసుబ్రహ్మణ్యం చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

చంద్రపల్లిలో 31 నుంచి బండలాగుడు పోటీలు

ప్యాపిలి: మండల పరిధిలోని చంద్రపల్లి గ్రామంలో ఈ నెల 31 వ తేదీ నుంచి శ్రీరామనవమి సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతగా నిలిచిన వృషభాలకు రూ. 25,116 నగదు బహుమతి అందజేస్తామన్నారు. రెండవ, మూడవ, నాలుగో స్థానంలో నిలిచిన వృషభాలకు వరుసగా రూ. 15,116, రూ. 10,116, రూ. 5,116 చొప్పున బహుమతులు అందజేస్తామన్నారు. ఏప్రిల్ 1 వ తేదీ కేటగిరి విభాగంలో పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వృషభాల యాజమాన్యాలకు రూ. 45,116, రూ. 40,116 చొప్పున అందజేస్తామన్నారు. అదేవిధంగా మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిదో స్థానంలో నిలిచిన వృషభాల యాజమాన్యాలకు వరుసగా రూ. 30,116, రూ. 20,116, రూ. 15,116, రూ. 10,116, రూ. 6,116, రూ. 5,116 చొప్పున అందజేస్తామని వివరించారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

డోన్ టౌన్: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో న్యాక్, ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు న్యాక్ సహాయ సంచాలకులు సంతోష్‌కుమార్, జిల్లా అధికారి ప్రతాప్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డోన్‌లో ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి నూతన బ్యాచ్ ప్రారంభం అవుతుందని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 30వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, అసిస్టెంట్ ప్లంబర్, జనరల్ సర్వేయర్ తదితర కోర్సులకు 3 నెలల్లో స్వల్ప కాలిక శిక్షణ ఇచ్చి ఉద్యోగవకాశాలు కల్పిస్తామన్నారు. టెన్త్, ఇంటర్ చదివిన వారు అర్హులన్నారు.

నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ



భూమి పూజలో పాల్గొన్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ వచ్చిందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, జెడ్పీటీసీ శివలక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముద్దవరం జెడ్పీ హైస్కూల్లో రూ.1.51 కోట్లతో చేపట్టే అదనపు తరగతి గదులు, కాంపౌండువాల్ నిర్మాణ పనులకు హెచ్‌ఎం సర్వేశ్వర ఆచారి గ్రామ సర్పంచ్ తిమ్మయ్య ఆధ్వర్యంలో ఆదివారం వారు భూమి పూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదల విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులు నిర్వహించిన సరస్వతి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ కేవీఆర్ కళాశాల అధ్యాపకులు అజాంబేగ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాజా హుసేన్, బుగ్గన కుమార్ రెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డి, జయరాముడు, సూర్య బళ్లాని, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు , మాజీ ఎంపీటీసీ రామకృష్ణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం మంగపల్లె గ్రామంలో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. మండలంతోపాటు కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, అవుకు, కొలిమిగుండ్ల మండలాలకు చెందిన రోగులకు గుండె, బీపీ, షుగర్, మోకాళ్లనొప్పులు తదితర వ్యాధులకు డాక్టర్లు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ ట్రస్టు అధ్యక్షుడు పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి మాట్లాడుతూ సొంత గ్రామానికి సేవ చేయాలన్న తలంపుతో ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన రోగులకు వైద్యంతోపాటు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో ఆ ట్రస్టు డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి పాల్గొన్నారు.

ఎద్దుల పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే కాటసాని



సీనియర్ విభాగపు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరీ జ్యోతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన వృషభరాజముల సీనియర్ విభాగపు బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జ్యోతి ఉత్సవాల సందర్భంగా ఇక్కడ ప్రతి సంవత్సరం రాష్ట్రస్థాయి సీనియర్, న్యూకేటగిరి, ఆరుపండ్ల లోపు విభాగం వృషభరాజముల పోటీలు నిర్వహించుకోవడం సంప్రదాయంగా మారిందన్నారు. సీనియర్ విభాగపు పోటీల్లో మొత్తం 13 వృషభరాజముల జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. సీనియర్ విభాగం పోటీలకు సంబంధించి ఎనిమిది బహుమతుల మొత్తాన్ని రూ. 3.05 లక్షలను ఎమ్మెల్యే కాటసాని పెద్దకుమారుడు దివంగత కాటసాని నాగార్జునరెడ్డి జ్ఞాపకార్థం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జయమ్మ దంపతులు సొంత నిధులను అందజేశారు. అదేవిధంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ పీఆర్ వెంకటేశ్వర్‌రెడ్డి, స్థానిక నాయకులు దశరథరామిరెడ్డి, చిన్ని ఓబులరెడ్డి, నర్సిరెడ్డి, రామారెడ్డి, శంకర్ రెడ్డి ప్రతాప్‌రెడ్డి తదతరలు పాల్గొన్నారు.

రైతన్నను వెంటాడుతున్న వర్షం బెంగ..!





అమడాల సమీపంలో మిరపదిగుబడులు తడవకుండా పట్టలు కప్పిన దృశ్యం

కోవెలకుంట్ల: ఉపరితల ద్రోణి ప్రభావం అన్నదాతను వెంటాడుతోంది. పదిరోజుల క్రితం కురిసిన వడగండ్ల వర్షం బీభత్సం సృష్టించి రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాల వాడ, దొర్నిపాడు మండలాల్లో పంటల దిగుబడులు చేతి కందే తరుణంలో కురిసిన అకాల వర్షంతో అపార నష్టం సంభవించింది. మిరప, వరి, మొక్కజొన్న, మినుము తదితర పంటల దిగుబడులు తడిచి పోయి తీవ్రనష్టం వాటిల్లింది. సబ్ డివిజన్‌లోని మండలాల్లో 8 వేల ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు వ్యవసాయ, ఉద్యావన శాఖ అధికారులు అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఆ నష్టం నుంచి తేరుకుంటున్న తరుణంలో మరోసారి ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షపు జల్లులు పడ్డాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండి ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఆకాశం మేఘావృతం కావడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. భారీ వర్షం కురుస్తుందన్న బెంగ రైతులను వెంటాడుతోంది. కల్లాల్లోని పంటల దిగుబడులు తడిచిపోకుండా పట్టలు కప్పుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. వరణుడు మరలా విశ్వరూపం ప్రదర్శిస్తే మిగిలిన కాస్త దిగుబడులు కూడా తడిచిపోయి నష్టం మిగులుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.